క్లుప్తంగా

ఎమ్మెల్యే వెలంపల్లికి కృతజ్ఞతలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం పాలకవర్గ సభ్యునిగా నియమించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు ఆలయ సభ్యుడు బుద్దా రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పాతబస్తీలోని వెలంపల్లి శ్రీనివాసరావు కార్యాలయంలో ఆయనను బుద్దా రాంబాబు బుధవారం సాయంత్రం కలిశారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రాంబాబు పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రాంబాబు అభిమానులు వెలంపల్లిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో తంగెళ్ల రాము, విశ్వనాథ రవి, దొడ్ల హేమంత్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన భక్తులు బుధవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. కాకినాడ జిల్లా జి.మామిడాడకు చెందిన ఎస్.రామచంద్రారెడ్డి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116ల విరాళాన్ని అందజేశారు. దాతకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను ఆలయ అధికారులు అందించారు.

రేపటి నుంచి నగరంలో 144 సెక్షన్ అమలు

విజయవాడ స్పోర్ట్స్: శాంతిభద్రతల పరిరక్షణకు విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 10 నుంచి మార్చి 31వ తేదీ వరకు(50 రోజులు) 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం, భవానిపురం, వన్‌టౌన్, సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని ప్రాంతాల్లో ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. ఆంక్షలు అమలులో ఉన్న సమయంలో నలుగురు, అంతకు మించిన వ్యక్తులు ఒకే ప్రదేశంలో గుమిగూడినా, కర్రలు, రాళ్లు, ఇతర మారణాయుధాలతో సంచరించినా శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నెట్‌బాల్ క్రీడాకారులకు సత్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో బుధవారం కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల టోర్నమెంట్‌లో ద్వితీయ స్థానం సాధించిన కళాశాల నెట్‌బాల్ క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థులు అంతర్ కళాశాల పోటీల్లో సత్తా చాటి ద్వితీయ స్థానం సాధించటం కళాశాలకే గర్వకారణమన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని పతకాలు సాధించి కళాశాల, నగర పేరు ప్రఖ్యాతులు ఇనుమడింపచేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, డాక్టర్ బి.యుగంధర్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రజ్వల్ స్వచ్ఛంద సంస్థ, కళాశాల స్త్రీ సాధికారత కమిటీ, ఇంక్లూజివ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యాన మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, ప్రజ్వల్ స్వచ్ఛంద సంస్థ సీనియర్ సమన్వయకర్త వై.చంద్రయ్య మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణాలో జరుగుతున్న మానవ, అవయవ అక్రమ రవాణా గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మానవ అక్రమ రవాణా ఏ విధంగా జరుగుతుందో వివరించారు. స్త్రీ సాధికారత సమన్వయకర్త డాక్టర్ బి.శుభ, టి.వి.వి.ప్రియ, తహసీన్, లక్ష్మీభారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నీచ రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు

మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు

పూర్ణనందంపేట(విజయవాడపశ్చిమ): నీచ రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబునాయుడు అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం 35వ డివిజన్ 191వ సచివాలయం పరిధిలోని పెజ్జోనిపేటలో నిర్వహించారు. ఈ పర్యటన డివిజన్‌లోని ఫిలిమ్‌గూడం, నాదార్‌వారివీధి, తెలుగు బాప్టిస్ట్ చర్చి వీధుల మీదుగా సాగింది. ఈ ప్రాంతాల్లోని ప్రజల నుంచి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉంటే చూడలేని చంద్రబాబునాయుడు నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎటువంటి పక్షపాతం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నరన్నారు. 35వ డివిజన్‌లో ఇరిగేషన్ స్థలంలో ఉంటున్న నివాసితులకు ప్రభుత్వం స్థలాలు కేటాయించిందని చెప్పారు. ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేయటం ఖాయమన్నారు. ప్రభుత్వం చేసిన పనులతో ప్రజల ముందుకు వెళ్తాన్నామన్నారు. వలంటీర్లు సమర్థవంతంగా పని చేస్తున్నారని ప్రతి గడపలో ప్రజలు వారి సేవలను మెచ్చుకుంటున్నారని తెలిపారు. 35వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కొన్ని చోట్ల చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులతో వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సంక్షేమ పథకాలు అందని అర్హులైన వారు ఎవరైన ఉంటే సచివాలయంలో వలంటీర్లను సంప్రదించి పథకాలను పొందవచ్చన్నారు. పర్యటనలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ నాయకులు బలసాని కిరణ్, పొలిమెట్ల శరత్‌బాబు, సుజాత, అనంత్, శివ, రంగరావు, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



35వ డివిజన్‌లో చిరు వ్యాపారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

27, 28 తేదీల్లో సైన్స్ డే వేడుకలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎస్ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో సైన్స్ డే వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాసు చెప్పారు. సైన్స్ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆ కళాశాల కమిటీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తూనుకుంట్ల శ్రీనివాసు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 28వ తేదీన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 27, 28 తేదీల్లో వేడుకలు జరుగుతాయన్నారు. 27న ఎనిమిది, తొమ్మిది తరగతి విద్యార్థులకు సైన్స్ స్టోరీ టెలింగ్, పోస్టర్ ప్రజెంటేషన్, బెస్ట్ ఫ్రమ్ వేస్ట్ పోటీలు, పదో తరగతి విద్యార్థులకు పిరియాడిక్ టేబుల్ క్విజ్, కార్బన్ మాల్ మేకింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 28న యూజీ, పీజీ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించటంతో పాటు సమకాలీన అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వేడుకల కన్వీనర్ డాక్టర్ టి.భాగ్యకుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, కె.మోహన్‌బాబు(షైన్) షైన్ డైరెక్టర్ కె.చంద్రశేఖర్, ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ జి.కృష్ణవేణి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తూనుకుంట్ల శ్రీనివాసు, అధ్యాపకులు

స్వర్ణకుమారి అకాల మరణం బాధాకరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): తలశిల స్వర్ణకుమారి చిన్న వయసులోనే అకాల మరణం చెందటం బాధాకరమని పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాల సమన్వయకర్త, శాసనమండలి సభ్యుడు తలశిల రఘురామ్ సతీమణి స్వర్ణకుమారి ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని రఘురామ్ నివాసానికి వచ్చిన ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు స్వర్ణకుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రఘురామ్‌ను కలిసి పరామర్శించారు. వారిలో డెప్యూటీ సీఎంలు నారాయణస్వామి, అంజాద్ బాషా, మంత్రులు ఆర్‌కే రోజా, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కొట్టు సత్యనారాయణ, బూడి ముత్యాలనాయుడు, ఆదిమూలపు సురేష్, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్, అనుముల్లా, ఎమ్మెల్యేలు పేర్ని వెంకట్రామయ్య(నాని), ఆళ్ల నాని, అవంతి శ్రీనివాస్, గ్రంధి శ్రీనివాస్, అబ్బయ్య చౌదరి, శంకర నారాయణ, పర్వత ప్రసాద్, కొండేటి చిట్టిబాబు, మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, పుష్ప శ్రీవాణి, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ కేవీపీ రామచంద్రరావు, పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకర పద్మశ్రీ, బి. కిరణ్, ధనేకుల మురళీమోహన్, కోమటి జగన్‌మోహన్‌రావు, పోతురాజు ఏసుదాసు, అక్కల నాగేంద్రప్రసాద్, చెరుకు ఆనందరావు తదితరులు ఉన్నారు.



రఘురామ్‌ను పరామర్శిస్తున్న మంత్రి రోజా

భర్త వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భర్త వేధింపులపై వివాహిత కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. గొల్లపాలెంగట్టు సాయిబాబా గుడి ప్రాంతానికి చెందిన లక్ష్మీమహతి 2013లో మీసాల ప్రశాంత్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. ప్రశాంత్ బస్టాండ్ క్యాంటీన్‌లో క్యాషియర్‌గా పని చేస్తుంటాడు. ప్రశాంత్ మద్యానికి, బెట్టింగులకు బానిసై భార్య, పిల్లలను పట్టించుకోవడం లేదు. ప్రతి రోజు తాగి వచ్చి భార్యను వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

ముగిసిన నవదిన ప్రార్థనలు

గుణదల(విజయవాడతూర్పు): మేరీమాత పుణ్యక్షేత్రంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న నవదిన ప్రార్థనలు బుధవారంతో ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు పెద్ద సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారు. పలు విచారణల భక్తులు, మఠకన్యలు, పుణ్యక్షేత్ర గురువులు జపమాలలు ధరించి కొండపైకి చేరుకున్నారు. మరియమాత స్వరూపం వద్ద జరిగిన సమష్టి బలి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ దేవుని వాక్య సందేశం అందించారు. ఆయన మాట్లాడుతూ.. మరియమాత చల్లని దీవెనలు భక్తులందరిపై ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆ నిష్కళంక మాతకు విధేయులుగా ఉండాలని కోరారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సమష్టి దివ్య బలిపూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఫాదర్ గాబ్రియేలు, ఫాదర్ అనిల్, ఫాదర్ థామస్ పాల్గొన్నారు.

రౌడీషీటర్ క్రైం బాబీ నగర బహిష్కరణ పొడిగింపు

విజయవాడ స్పోర్ట్స్: రౌడీషీటర్ సందక దుర్గారావు అలియాస్ బల్లిగుడ్డు అలియాస్ క్రైం బాబీ నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. విజయవాడ మాచవరానికి చెందిన క్రైం బాబీ కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పలు మార్లు ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించారు. అనేక సార్లు జైలు జీవితం అనుభవించినా అతనిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో గతేడాది జూలైలో నగరం నుంచి బహిష్కరించారు. అయినా అతనిలో మార్పు రాలేదని, నగరంలోకి వస్తే మరిన్ని ఘర్షణలకు పాల్పడి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తాడనే నిఘా వర్గాల సమాచారంతో బహిష్కరణను పొడిగించామని సీపీ చెప్పారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఆటోనగర్(విజయవాడతూర్పు): కరెన్సీనగర్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై పటమట పోలీసులు బుధవారం దాడి చేశారు. స్థానిక కరెన్సీనగర్ గణేష్‌నగర్ కాలనీ 11వ లైన్ అపార్ట్‌మెంట్‌లో గత కొంతకాలంగా గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. పోలీసులకు వచ్చిన పక్కా సమాచారంతో దాడి చేసి ముగ్గురు మహిళలు, మరో ఇద్దరు విటులతో పాటు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. సంబంధిత ఆర్గనైజర్ యువకులకు సెల్‌ఫోన్‌లో యువతుల ఫొటోలను పంపుతున్నట్లు పోలీసులు చెప్పారు. వీరందరిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసునమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలి

ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు

విజయవాడకల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు తెలిపారు. తెలుగు కళావాహిని పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదిక మీద బుధవారం జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకురాలు, సామాజిక కార్యకర్త కోట ఝాన్సీ రాణి సంస్మరణ సభను నిర్వహించారు. విజయబాబు మాట్లాడుతూ ఆమె శాస్త్రీయ కళారంగాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. జనవిజ్ఞాన వేదిక కార్యక్రమాల ద్వారా యువతీ యువకులను చైతన్య పర్చారని తెలిపారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. ఘంటసాల చైతన్యవేదిక ద్వారా ఆమె కొత్త గాయనీ గాయకులను పరిచయం చేశారన్నారు. సంస్మరణ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, కోట వెంకటేశ్వరరెడ్డి, విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ వెన్నా వల్లభరావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు పాల్గొని ఝాన్సీరాణి సేవలను కొనియాడారు.



నివాళులర్పిస్తున్న అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు, గోళ్ల నారాయణరావు, వెన్నా వల్లభరావు

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు అవుతాయని దిశా పోలీసుస్టేషన్ ఎస్ఐ కె.పూర్ణిమా రమణి అన్నారు. కేబీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, నవజీవన్ బాలభవన్, సచివాలయం మహిళా పోలీసు విభాగాల ఆధ్వర్యంలో మత్తు పదార్థాలతో యువతకు కలిగే అనర్థాలపై అవగాహనా కార్యక్రమాన్ని కళాశాల సెమినార్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పూర్ణిమా రమణి మాట్లాడుతూ.. యువత ఏ మాత్రం తప్పటడుగులు వేసినా జీవితాన్ని కోల్పోతారన్నారు. యువతలకు ఎటువంటి ఇబ్బందులెదురైనా దిశా యాప్‌ను వినియోగించుకొని రక్షణ పొందాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియాలను అవసరానికి మాత్రమే వినియోగించుకోవాలన్నారు. వాటి వలన అనేక ఇబ్బందులెదురవుతాయని ఉదాహరణలతో వివరించారు.

అత్యుత్తమమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి

క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ షీలానికోలస్ మాట్లాడుతూ మత్తు అనేక రూపాల్లో యువతకు లభిస్తుందన్నారు. యువత తమ జీవితానికి అత్యుత్తమమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని ముందుకు సాగాలని చెప్పారు. మత్తు వలన కలిగే ఇబ్బందులు కుటుంబాన్ని, సమాజాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తాయో వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారావు, నవజీవన్ బాలభవన్ సైకాలజిస్ట్ అనూష, సచివాలయం మహిళా పోలీసులు సీహెచ్ సంఘవి, బి.వినీత తదితరులు మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ పీఓ వీఎస్‌రావు కార్యక్రమాన్ని నిర్వహించగా పీఓలు డి.పవన్‌కుమార్, ఎన్.సాంబశివరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ పూర్ణిమారమణి

శ్రీరామమూర్తి హరికథా సేవలు ఆదర్శనీయం

విజయవాడకల్చరల్: విఖ్యాత హరికథా భాగవతులు గుడిపాటి శ్రీ రామమూర్తి హరికథా సేవలు ఆదర్శనీయమని బుర్రా పద్మనాభ శర్మ అన్నారు. గుడిపాటి కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సీతారామా కల్యాణమండపంలో బుధవారం హరికథా భాగవతార్ గుడిపాటి శ్రీ రామమూర్తి 166వ జయంతి ఉత్సవం, హరికథా గానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మనాభశాస్త్రి మాట్లాడుతూ హరికథ పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు స్ఫూర్తితో సంగీత సాహిత్యాలను మేళవిస్తూ భాగవత తత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేవారన్నారు. ఆయనతో అనుబంధం గుర్తుచేసుకున్నారు. సంగీత విద్వాంసుడు దావులూరి వీరభద్రరావు మాట్లాడుతూ.. ఆయన కథా సంవిధానం శ్రవణానందంగా ఉండేదన్నారు. నాటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ ముందు హరికథా గానం చేశారని గుర్తుచేశారు. జయంతి సభలో గుడిపాటి దత్తు, గుడిపాటి కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు జయరాం సుధాకర్ పాల్గొన్నారు. కథా శ్రవణంలో భాగంగా హరికథా భాగవతారిణి మోపిదేవి దుర్గామహాలక్ష్మి సుందరాకాండ ఆధారంగా రచించిన హనుమత్ సందేశం కథను గానం చేశారు. పాణ్యం దక్షిణా మూర్తి, అమ్ముల ప్రసాద్ వాద్య సహకారం అందించారు.



మాట్లాడుతున్న బుర్రా పద్మనాభ శాస్త్రి, వేదికపై దావులూరి వీరభద్రరావు, దుర్గామహాలక్ష్మి

తెలుగు నాటక రంగ చరిత్ర విశిష్టమైనది

విజయవాడకల్చరల్: తెలుగు నాటక రంగ చరిత్ర విశిష్టమైనదని హ్యాపీ రిసార్ట్స్ అధినేత అంబటి మధుమోహనకృష్ణ అన్నారు. శిల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం నాటక రంగ ప్రముఖులకు ఆత్మీయ సత్కారం, నాటక ప్రదర్శన నిర్వహించారు. మధుమోహన కృష్ణ తెలుగు నాటకరంగంలో వస్తున్న మార్పులను స్వాగతించాలని సూచించారు. నాటక రంగ ప్రముఖుడు ఎస్ఎం బాషా మాట్లాడుతూ కొత్త తరాన్ని నాటకం రంగవైపు తీసుకురావాల్సిన అవసరముందన్నారు. నిర్వాహకులు సాహితీ ప్రముఖుడు జరుగుల రామారావుకు శిల్పా ఫౌండేషన్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. సామాజిక సేవా రంగానికి పురాణం కృష్ణ ప్రసాద్‌ను ఆత్మీయంగా సత్కరించారు. చివరిగా బీనా దేవి రచించి, అద్దేపల్లి లక్షణ శాస్త్రి దర్శకత్వం వహించిన థ్యాంక్స్ ఫర్ ది పీఎం సాంఘిక నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో బోడి ఆంజనేయరాజు, కృష్ణ ప్రసాద్, శిల్పా ఫౌండేషన్ ట్రస్టీ భాస్కరరావు పాల్గొన్నారు.



రామారావును సత్కరించిన మధుమోహన కృష్ణ, బోడి ఆంజనేయరాజు, కృష్ణ ప్రసాద్ తదితరులు

● ఉత్సాహంగా మహిళా ఫెస్ట్



మాట్లాడుతున్న డీసీపీ విశాల్ గున్నీ





విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో బుధవారం తరుణీ తరంగాలు ఆధ్వర్యంలో ఐదవ మహిళా ఫెస్ట్ ఉత్సాహంగా ప్రారంభమైంది. పలువురు వక్తలు పాల్గొని తమ సందేశం ఇచ్చారు. రెండు రోజుల పాటు జరిగే మహిళా ఫెస్ట్‌లో శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు, అభ్యుదయ, జానపద గీతాలాపన పోటీలు, కథ, కవితా రచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ